



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
మంగళవారం
21 మే 2024
పేజీలు: 02






## నష్టాల్లో స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:21 గంటల సమయంలో సెన్సెక్స్ 100 పాయింట్లు నష్టపోయి 73,906 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 46 పాయింట్లు కుంగి 22,455 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.31 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, విప్రో, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. నెస్లే ఇండియా, ఎం అండ్ ఎం, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి షేర్లు అత్యధికంగా నష్టపోతున్న జాబితాలో ఉన్నాయి.

## ఆల్‌టైమ్ హైకి బంగారం ధరలు.. తులం రూ.75,160



బంగారం ధరలు హైదరాబాద్‌లో ఆల్‌టైమ్ హైకి చేరాయి. మునుపెన్నడూ లేనివిధంగా తులం రూ.75 వేలపైనే పలికింది. సోమవారం 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి ధర తొలిసారి ఏకంగా రూ.75,160గా నమోదైంది. 22 క్యారెట్ కూడా రూ.68,900గా ఉన్న ది. ఈ ఒక్కరోజే రూ.540, రూ.500 చొప్పున పెరిగాయి. మరోవైపు దేశ రాజధాని న్యూఢిల్లీలో గరిష్ఠంగా 24 క్యారెట్ పసిడి రేటు 10 గ్రాములు రూ. 75,310ని తాకింది. 22 క్యారెట్ కూడా రూ.69,050గా నమోదైంది.

**20 రోజుల్లో 5% అప్**

ఈ నెల మొదలు ఇప్పటిదాకా హైదరాబాద్‌లో గోల్డ్ ధర 5.1 శాతం ఎగబాకినట్లు మార్కెట్ గణాంకాలు చెప్తున్నాయి. మే 1న 22 క్యారెట్ పసిడి తులం రూ.65, 550 గా ఉన్నది. అలాగే 24 క్యారెట్ పుత్తడి రూ.71,510గా ఉన్నది. ప్రస్తుతం రూ.68, 900, రూ.75,160గా ఉన్నాయి. దీంతో గత 20 రోజుల్లో 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.3,350, 24 క్యారెట్ పసిడి తులం రూ.3,650 చొప్పున పెరిగినట్టైంది.



## కూటమికి 300 కంటే ఎక్కువ సీట్లు

**ఢిల్లీ సీఎం కేజ్రీవాల్**

కూటమికి 300 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని సీఎం కేజ్రీవాల్ జోస్యం చెప్పారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఐదో దశ పోలింగ్ మే 20(సోమవారం) పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఐదో దశ ఎన్నికలు విజయవంతంగా ముగిసిపోయాయి. తదుపరి రెండు దశల ఎన్నికలు జరుగుతున్న తరుణంలో జూన్ 4న మోడీ ప్రభుత్వం విడిపోయి, భారత కూటమి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందన్నారు. అలాగే ప్రస్తుతం ట్రెండ్ చూస్తుంటే భారత కూటమికి 300 కంటె ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. అనంతరం బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

## నేడు ఐపీఎల్ క్వాలిఫయర్-1

# ఫైనల్లో అడుగు పెట్టేదెవరో?

రెండు నెలలుగా క్రికెట్ అభిమానులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతున్న ఐపీఎల్-17 నాకౌట్ దశకు చేరుకుంది. క్వాలిఫయర్-1లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్ వేదికగా టేబుల్ టాపర్ కోల్‌కతా.. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్‌ను ఢీకొననుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం ఉండటంతో మరో మ్యాచ్ (క్వాలిఫయర్ 2) ఆలోచన లేకుండా ఇరు జట్లూ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. సీజన్ ఆసాంతం నిలకడగా రాణిస్తూ సమిష్టి ప్రదర్శనలతో ప్లేఆఫ్స్ చేరిన ఈ రెండు జట్లలో మ్యాచ్ విన్నర్లకు కొదవలేకపోవడంతో మొతేరా స్టేడియంలో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది.

**'సాల్ట్' లేని కోల్‌కతా..**

ఈ సీజన్‌లో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీ అయిన ఫిల్ సాల్ట్-సునీల్ నరైన్ బాదుడుకు బలికాని ప్రత్యర్థి లేరంటే అతిశయోక్తి లేదు. కానీ ప్లేఆఫ్స్‌లో కేకేఆర్‌కు సాల్ట్ లేకపోవడం ఎదురుదెబ్బే. జాతీయ జట్టు (ఇంగ్లండ్) బాధ్యతల నిమిత్తం అతడు కోల్‌కతాను వీడాడు.ఈ నేపథ్యంలో కేకేఆర్ టాప్ స్కోరర్ నరైన్ (461) పై మరోసారి భారీ ఆశలే పెట్టుకుంది. అతడిని త్వరగా ఔట్ చేస్తే మిడిలార్డర్ కూడా తడబడుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నా అతడూ ప్రమాదకారే. వెంకటేశ్ అయ్యర్, నితీశ్ రాణా నిలకడకు తోడు ఆఖర్లో ఆండ్రీ రస్సెల్ మెరుపులు మెరిపిస్తే హైదరాబాద్‌కు తిప్పలు తప్పవు.




ఆడేది తక్కువ బంతులే అయినా రమణ్‌దీప్ సింగ్ భారీ హిట్టింగ్‌లతో కీలక పరుగులు రాబడుతున్నాడు. కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ బౌలింగ్ దళం వీళ్లను ఎలా కట్టడి చేస్తుందన్నది ఆసక్తికరం.

**వాళ్లిద్దరి మీదే ఆశలు..**

హైదరాబాద్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన ట్రావిస్ హెడ్ (533 పరుగులు), అభిషేక్ శర్మ (467) ఎలా ఆడతారన్నదానిపైనే సన్‌రైజర్స్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ విజయాలలో వీరిదే అగ్రతాంబూలం అని చెప్పక తప్పదు. ఈ ఇద్దరూ తొలి 8 ఓవర్ల పాటు క్రీజులో నిలిస్తే స్టార్క్ అండ్ కో.కు బడిత పూజ తప్పదు. మూడో స్థానంలో రాహుల్ త్రిపాఠికి మరోసారి అవకాశం దక్కితే అది జట్టుకు మేలు చేసేదే. వైజాగ్ కుర్రాడు నితీశ్ రెడ్డి అంచనాలకు మించి రాణిస్తుండటం ఎస్‌ఆర్‌హెచ్‌కు అదనపు బలం. పంజాబ్‌తో మ్యాచ్‌లో క్లాసెన్ ఫామ్‌లోకి రావడం హైదరాబాద్‌కు శుభసూచకమే.

కేకేఆర్: నరైన్, గుర్బాజ్, శ్రేయస్ (కెప్టెన్), వెంకటేశ్, నితీశ్, రింకూ, రస్సెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్, చక్రవర్తి

ఎస్‌ఆర్‌హెచ్: హెడ్, అభిషేక్, త్రిపాఠి, నితీశ్, క్లాసెన్, షాబాజ్, సమద్, సన్వీర్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్

## చాలా మందితో ఆ పని చేశా..

ఈషా రెబ్బా.. తెలుగు హీరోయిన్ ఈషా రెబ్బా మిడిల్ రేంజ్ హీరోలకి హీరోయిన్ గా స్టార్ హీరోల సినిమాల్లో సెకండ్ హీరోయిన్గా నటిస్తోంది.ఇక ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం కొన్ని ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఎన్నో ఆసక్తికరమైన విషయాలను బయట పెడుతోంది. అయితే సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ తన అభిమానులకు ఎప్పటికప్పుడు తన అందాల రుచి చూపిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు హాట్ హాట్ ఫోటోషూట్స్ తీస్తూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కుర్రకారును ఉర్రూతలూగిస్తుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ రీసెంట్ గా నేను అరవింద సమేత సినిమాలో చేసి ఎంతగానో బాధపడ్డానని ఆ సినిమాలో ముందుగా చెప్పింది వేరు తర్వాత నా క్యారెక్టర్ కి సంబంధించిన సన్నివేశాలు లేపేసి స్క్రీన్ మీద నన్ను తక్కువ చూపించారని బాధపడింది.



## డీజీపీ ఫొటోతో వాట్సప్ డీపీ..

సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు తెలంగాణ డీజీపీ ఫొటోతో కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వాట్సప్ డీపీగా డీజీపీ రవిగుప్తా ఫొటో పెట్టి మోసాలు చేస్తున్నారు. ఈక్రమంలో ఓ వ్యాపారవేత్తకు, ఆయన కుమార్తెకు వాట్సప్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేస్తామని తెలిపారు. కేసు నుంచి తప్పించేందుకు రూ.50 వేలు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన వ్యాపారవేత్త సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాకిస్థాన్ కోడ్ +92తో వాట్సప్ కాల్ వచ్చినట్లు గుర్తించారు.




## టీజీ 09 9999.. రూ.25.50 లక్షలు

రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక వాహన ఫ్యాన్సీ నంబరుకు ఏకంగా రూ.25.50 లక్షల రాబడి వచ్చింది. ఖైరతాబాద్‌లోని రవాణా కార్యాలయంలో సోమవారం కొత్త సిరీస్ ప్రారంభమైన సందర్భంగా ఆన్‌లైన్ వేలం నిర్వహించారు. టీజీ09 9999 నంబరును సోని ట్రాన్స్‌పోర్టు సొల్యూషన్స్ తమ టయోటా ల్యాండ్ క్రూజర్ ఎల్‌ఎక్స్ కోసం రూ.25,50,002 చెల్లించినట్లు హైదరాబాద్ జేడీసీ సి.రమేశ్ తెలిపారు. దీంతోపాటు మరికొన్ని ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా ఒక్కరోజే రవాణా శాఖకు రూ.43,70,284 ఆదాయం సమకూరిందని వివరించారు.

## ఉబర్ బస్సులు వచ్చేస్తున్నాయ్

తక్కువ ఖర్చుతో మంచి ప్రయాణ అనుభూతిని పొందేందుకు ఉబర్ ఈ సేవలను ప్రారంభిస్తోంది. ఇప్పటికే పలు దేశాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండగా తాజాగా భారత్‌లో కూడా ఈ సేవలను ప్రారంభించేందుకు ఉబర్ సన్నాహాలు చేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో తొలుత ఈ సేవలను ప్రారంభించనున్నారు. ఢిల్లీ ప్రీమియం స్కీమ్ కింద ఇకపై బస్సులను అందుబాటులోకి.. తక్కువ ఖర్చుతో మంచి ప్రయాణ అనుభూతిని పొందేందుకు ఉబర్ ఈ సేవలను ప్రారంభిస్తోంది. ఇప్పటికే పలు దేశాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండగా తాజాగా భారత్‌లో కూడా ఈ సేవలను ప్రారంభించేందుకు ఉబర్ సన్నాహాలు చేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో తొలుత ఈ సేవలను ప్రారంభించనున్నారు. ఢిల్లీ ప్రీమియం స్కీమ్ కింద ఇకపై బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు.







## రేపటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేత

ఆరోగ్య శ్రీ కింద రోగులకు అందించిన చికిత్స బిల్లులను ప్రభుత్వం చెల్లించట్లేదని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) వెల్లడించింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆశా పేర్కొంది. గత ఆగస్టు నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయని, వీటి విలువ సుమారు రూ.1,500 కోట్లు ఉంటుందన్నారు.



## ఇబ్రహీం రైసీపై అమెరికా సంచలన వ్యాఖ్యలు

ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణంపై సంతాప ప్రకటనలో అమెరికా ఆయనపై తీవ్ర ఆరోపణలు చేసింది. రైసీ చేతులు రక్తంతో తడిచాయంటూ పరోక్షంగా అనేక హింసాత్మక ఘటనల్లో ఆయన పాత్ర ఉందని ఆరోపించింది. 'ఇరాన్‌లో హక్కుల అణచివేతలో ఆయన పాత్ర ఉంది. హమాస్ లాంటి తీవ్రవాద సంస్థలను వెనకేసుకొచ్చారు' అని పేర్కొంది. అటు సాధారణంగా ఎవరు మరణించినా తాము సంతాపం తెలుపుతామని, అలాగే రైసీ మృతికీ సంతాపం తెలుపుతున్నాం' అని యూఎస్ఏ పేర్కొంది.

## టాల్కమ్ పౌడర్‌తో అండాశయ క్యాన్సర్

టాల్కమ్ పౌడర్‌తో మహిళల్లో అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు తేల్చారు. జననాంగాలపై తరచుగా వాడే మహిళల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉందని USలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ శాస్త్రవేత్తలు తెలిపారు. దాదాపు 50వేల మంది మహిళలపై పరిశోధనలు చేసి పౌడర్‌లోని అస్బెస్టాస్ అనే ఖనిజమే ఇందుకు కారణమని తేల్చారు. అస్బెస్టాస్ లేని పౌడర్‌తో ప్రమాదం లేదని తెలిపారు.






సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM



## 2024 ఎన్నికల్లో బెస్ట్ ఫొటో ఇదే

### ఆనంద్ మహీంద్రా

ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా తన X ఖాతాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. నిన్న ముగిసిన ఐదో దశ లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి ఓటేసిన గిరిజనుడి ఫొటోను ఆయన నెటిజన్లతో పంచుకున్నారు. తన వరకు 2024 ఎన్నికల్లో బెస్ట్ ఫొటో ఇదేనంటూ మహీంద్రా కొనియాడారు. ప్రజాస్వామ్యానికి ఎదురులేదని, తిరుగులేని శక్తి అని ఆనంద్ మహీంద్రా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరలవుతోంది.



## రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోదీ

దివంగత రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. 'వర్ధంతి సందర్భంగా మన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నా నివాళులు' అని ట్వీట్ చేశారు. కాగా, రాజీవ్ గాంధీ 1984-1989 మధ్య ఇండియాకు ప్రధానిగా పని చేశారు. 1991లో తమిళనాడులోని శ్రీపెరంబదూరులో LTTE ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురయ్యారు.



## USలో ఇండియా 'జనరిక్స్'దే హవా

తక్కువ ధరకు జనరిక్ మందుల సరఫరాలో భారత కంపెనీలు సత్తా చాటుతున్నాయి. 2022లో USలోని రోగులు వినియోగించిన మొత్తం జనరిక్స్‌లో 47% మన కంపెనీలవే. మానసిక రుగ్మతలు, హైపర్ టెన్షన్, లిపిడ్ రెగ్యులేటర్స్, యాంటీ అల్సర్స్, డయాబెటిస్ సంబంధ మందులు ఎక్కువగా వాడుతున్నారట. దీనివల్ల 2022లో US హెల్త్ డిపార్ట్‌మెంట్ 219 బిలియన్ డాలర్లు ఆదా చేయగలిగింది. 2013-2022 మధ్య ఏకంగా 1.3 ట్రిలియన్ డాలర్లను పొదుపు చేసింది.

# టీమిండియా హెడ్ కోచ్‌గా ధోనీ?




ఈ టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత భారత జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగియనుంది. అందుకే, ఇప్పుడు కొత్త కోచ్ ఎంపిక కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ దరఖాస్తు ఆహ్వానం తర్వాత, ప్రధాన కోచ్ పదవిలో మహేంద్ర సింగ్ ధోని కనిపిస్తారని ఒక వార్త వ్యాప్తి చెందడం ప్రారంభించింది.కొన్ని నివేదికల ప్రకారం, రాహుల్ ద్రవిడ్ వారసుడిగా మహేంద్ర సింగ్ ధోని కనిపించనున్నారు. దీనికి ముందు, సీఎస్‌కే జట్టు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ భారత జట్టు కోచ్‌గా మారే అవకాశం ఉందని కూడా వచ్చాయి. అయితే, పలు ఫ్రాంచైజీ లీగ్ జట్లలో కోచ్‌గా పనిచేస్తున్న ఫ్లెమింగ్ బీసీసీఐ ఆఫర్‌ను తిరస్కరించే అవకాశం ఉంది. భారత జట్టు కోచ్ పదవి నుంచి ఫ్లెమింగ్ వైదొలిగే అవకాశం ఉండడంతో బీసీసీఐ ముందు ఇద్దరు పేర్లు వచ్చాయి. వారే గౌతమ్ గంభీర్, మహేంద్ర సింగ్. ఇప్పటికే లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌లకు మెంటార్‌గా విజయం సాధించిన గౌతమ్ గంభీర్‌ను ప్రధాన కోచ్‌గా నియమించాలని బీసీసీఐ ప్రతిపాదించినట్లు సమాచారం. ఆ తర్వాత అతను టీమిండియాలో ముఖ్యమైన పదవిని చేపట్టలేదు. ఇప్పుడు మళ్లీ ధోనీకి చీఫ్ పదవి ఇచ్చేందుకు బీసీసీఐ ఆసక్తి చూపుతోంది. అందుకు తగ్గట్టుగానే భారత ప్రధాన కోచ్‌గా మహేంద్ర సింగ్ ధోనీ కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడో లేదో వేచి చూడాల్సి ఉంది. మూడేళ్ల కాలానికి టీం ఇండియాకు కొత్త కోచ్‌ని నియమించాలని బీసీసీఐ నిర్ణయించింది. దీని ప్రకారం, కొత్త కోచ్ జులై 1, 2024 నుంచి డిసెంబర్ 31, 2027 వరకు పని చేస్తుంది. ఈ సమయంలో, భారత జట్టులోని ముఖ్యమైన ఆటగాళ్లు, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ T20 క్రికెట్ నుంచి రిటైర్ కానున్నారు. యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేసేందుకు అనుభవజ్ఞుడైన క్రికెటర్ అవసరం. అందుకే మహేంద్ర సింగ్ ధోనీని ప్రధాన కోచ్‌గా తీసుకోవడానికి బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

### మరో ఇద్దరి పేర్లు కూడా?

ఫ్లెమింగ్ నిర్ణయంతో బీసీసీఐ ఇతర ఆటగాళ్ల వైపు దృష్టి సారించింది. జస్టిన్ లాంగర్, గౌతమ్ గంభీర్, మహేల జయవర్ధనేల పేర్లు ఇప్పుడు వినిపిస్తున్నాయి. వారితో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. ఫ్లెమింగ్‌ను వదులుకోవడానికి బోర్డు సిద్ధంగా లేదు. ధోనీని మధ్యవర్తిగా చర్చలు నడిపి ఫ్లెమింగ్‌ను ఒప్పించాలని బీసీసీఐ ప్రణాళికలు రచిస్తోంది. టీమిండియా కోచ్ పదవికి ఫ్లెమింగ్ నో చెప్పలేదని.. కాంట్రాక్ట్ పదవీకాలంపై మాత్రమే ఆందోళన వ్యక్తం చేశాడని.. ఇది అసాధారణమేమీ కాదని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. రాహుల్ ద్రవిడ్ కూడా కోచ్ పదవిపై ఆరంభంలో ఆసక్తి చూపలేదని... కానీ తర్వాత అతనిని ఒప్పించారని... ఫ్లెమింగ్ విషయంలోనూ అదే జరగవచ్చని ఆ అధికారి గుర్తు చేశారు. ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ధోనీ, ఫ్లెమింగ్ సన్నిహితంగా ఉన్నారని.. ధోనీ చెప్తే ఫ్లెమింగ్ తప్పకుండా ఒప్పుకుంటారని బీసీసీఐ భావిస్తోంది. ధోనీ-ఫ్లెమింగ్ మధఅయ బలమైన బంధం ఉంది. మైదానం వెలుపల కూడా వీరిద్దరూ సన్నిహితంగా ఉంటారు. ఫ్లెమింగ్‌ను ఎవరైనా ఒప్పించగలిగితే అది ధోనియేనని బీసీసీఐలోని కీలక అధికారులు భావిస్తున్నారు.

## మతిపోగొడుతోన్న నభా నటేష్



నన్ను దోచుకుందువటే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది నభా నటేష్. తొలి సినిమాతోనే నటనతో మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. ఇక ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. కానీ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. టాలీవుడ్ ప్రేక్షకుల మనసులో ఇస్మార్ట్ పోరిగానే గుర్తుండి పోయింది. చేసినవి కొన్ని సినిమాలైనా.. తనదైన గ్లామర్ షోతో పాటు నటనతో యూత్‌కు ఆరాధ్య కథానాయికగా మారింది. తెలుగులో మేస్ట్రో తర్వాత ఈ భామ చేతిలో ఒక్క మూవీ లేకుండా పోయింది. తాజాగా స్వయంభూ మూవీతో తన సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది ఇస్మార్ట్ పోరి.



## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

### సీఎం రేవంత్ రెడ్డి

ఐటీ రంగ వృద్ధికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని సోమాజిగూడలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి, వి. హనుమంతరావు, షబ్బీర్ అలీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడి న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జూన్ 5 నుంచి 11 మధ్య రాష్ట్రంలోకి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు జూన్ 5 నుంచి 11వ తేదీ మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ నెలాఖరుకే కేరళను తాకనుండగా.. అక్కడి నుంచి ఏపీలోని రాయలసీమ మీదుగా తెలంగాణకు చేరుకోవడానికి ఐదారు రోజుల సమయం పడుతుంది. అంటే 5-8వ తేదీల మధ్యే వచ్చే అవకాశం ఉండగా.. కాస్త ఆలస్యమైతే 11వ తేదీలోగా రాష్ట్రమంతా విస్తరిస్తాయని భావిస్తున్నారు.





## కోడ్ ముగియగానే రేషన్ కార్డుల జారీ: పొంగులేటి

ఎన్నికల కోడ్ ముగియగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇల్లు లేని ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. 'అర్హులందరికీ కొత్త పెన్షన్లు కూడా ఇస్తాం. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తాం. అన్ని గ్రామాల్లో పాఠశాలలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తాం. ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం' అని ఆయన హామీ ఇచ్చారు.



## సెక్స్ వర్కర్ నిర్లక్ష్యం.. వారికి హెల్త్ అలర్ట్ జారీ

అమెరికాలోని ఒహైయో రాష్ట్రానికి చెందిన లిండా లెచెస్ ఓ సెక్స్ వర్కర్. 2022లో లిండాకి హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయినా సరే ఆమె పట్టించుకోకుండా ఈ రెండేళ్లలో దాదాపు 211 మందితో లైంగికంగా సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసి కంగుతున్న అధికారులు వెంటనే స్థానికులను అప్రమత్తం చేశారు. ఆమెతో శృంగారంలో పాల్గొన్న వారిని తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ అలర్ట్ జారీ చేసి, లిండాను అరెస్టు చేశారు.




## మాటలు రాని పిల్లల కోసం అమ్మ యాప్

వరంగల్ NIT విద్యార్థులు మాటలు సరిగా రాని పిల్లల కోసం అమ్మ పేరుతో ఓ యాప్‌ను రూపొందించారు. తొలిదశలో 50 పదాలతో ఆటల రూపంలో మాటలు మాట్లాడేలా, మాటలు రాని, బుద్ధిమాంద్యం గల 3-5 ఏళ్లలోపు పిల్లలకు ఉపయోగపడేలా దీన్ని ఆవిష్కరించారు. చిన్నారులకు త్వరగా మాటలు వచ్చేలా ఈ యాప్ ఒక వ్యాయామంలా ఉపయోగపడుతుందని దాన్ని రూపొందించిన విద్యార్థులు తెలిపారు. త్వరలోనే గూగుల్ ప్లేస్టోర్‌లో దీనిని అందుబాటులో ఉంచనున్నారు.



## మూడేళ్లలో 58 లక్షల చెట్లు నరికేశారు

2019-22 మధ్య దేశవ్యాప్తంగా వ్యవసాయ భూముల్లోని 58 లక్షల వృక్షాలను నరికేసినట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది. మధ్య భారతం, ముఖ్యంగా మహారాష్ట్ర, తెలంగాణలో ఈ కోత ఎక్కువగా ఉన్నట్లు తేలింది. 2010-11 మధ్య శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా 600 మిలియన్ల చెట్లను గుర్తించగా, వాటిలో 11% కనుమరుగయ్యాయని సైంటిస్టులు చెప్పారు. వరి, ధాన్యాల సాగు కోసమే ఈ పనిచేసినట్లు పేర్కొన్నారు. దీనివల్ల జీవవైవిధ్యానికి ముప్పు ఉందని తెలిపారు.